విశాలాంధ్ర
శ్రీకాకుళం
మంగళవారం 10, డిసెంబర్, 2024

రెవిన్యూ సదస్సు వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు సదస్సు కార్యక్రమాన్ని రైతులు వినియోగించుకోవాలని మండల తెలుగుదేశం అధ్యక్షులు మోహనరావు అన్నారు. సోమవారం మండలం అక్కుపల్లి, బైపల్లి గ్రామాలలో నిర్వహించిన రైతు సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ భూములకు సంబంధించి సర్వే నెంబర్లు గాని వన్ బిల్లు గాని రాకపోతే రెవిన్యూ సదస్సులో పూర్తిగా తమ

భూముల వివరాలు దరఖాస్తు రూపంలో అందజేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ తహసిల్దార్ మురళి, వీఆర్వో ఇందిరా వెంకట్రావు సర్పంచ్ ఇంచార్జి ఎల్ రామలింగం వీఆర్ఏ కవిత, మండల సర్వేయర్ కొండపు తిరుపతి రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలి

- జీవో నెంబర్ 77ని వెంటనే రద్దు చేయాలి
- ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ రవి

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, వసతి దీవెన డబ్బులు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం జడ్పీ కార్యాలయంలో జడ్పీ సీఈవోకి విద్యార్థి సంఘాల నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐ ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ రవి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ ఇంజనీరింగ్ పీజీ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ 2100 కోట్లు వసతి దీవెన 1400 కోట్లు పెండింగ్ లో ఉన్నాయి తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి సంవత్సరం విద్యార్థులకు సంబంధించి నాలుగు విడతల డబ్బులు జమ అయ్యేవని గత సంవత్సరం విద్యార్థులకు కేవలం ఒక క్వార్టర్ మాత్రమే విడుదల అయ్యి మిగతా మూడు క్వార్టర్లు విడుదల కాలేదని తెలిపారు. రాష్ట్రంలో దాదాపు 9.5 లక్షల మంది విద్యార్థులు డిగ్రీ ఇంజనీరింగ్ పీజీ విద్యను అభ్యసిస్తున్నారని, దానిలో ఒక క్వాటర్ ఫీజులు 708 కోట్లు విడుదల చేశారు మూడు క్వాటర్లకు సంబంధించి దాదాపు 2100 కోట్లు విడుదల చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఫీజు రియంబర్స్మెంట్ వసతి దీవెన డబ్బులు విడుదల కాక విద్యార్థులకు కోర్సులు అయిపోయినప్పటికీ సర్టిఫికెట్లు ఇవ్వకుండా కళాశాల యాజమాన్యం ఫీజు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని విద్యార్థులకు తెలియ జేస్తున్నా రాన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక సర్టిఫికెట్లు తీసుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు కూడా వచ్చే నెల నుంచి డిగ్రీ ఇంజనీరింగ్ పరీక్షలు మొదలవుతున్నాయి వాటికి గతంలో పెండింగ్లో ఉన్న డబ్బులు చెల్లిస్తేనే మీకు పరీక్షలకు అనుమతి స్తామని కళాశాల యాజమాన్యాలు అంటున్నాయని, గతంలో వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో విద్యార్థుల చదువు భవిష్యత్తు అంతా నాదే అని చెప్పిన జగన్ దాదాపు 5 సంవత్సరాలలో 3500 కోట్లు విద్యార్థుల సొమ్ము ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. ప్రస్తుత అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వమైనా విద్యార్థుల ఇబ్బందులు వారి సమస్యను గుర్తించి తక్షణమే పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ వసతి దీవెన డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసి విద్యార్థుల కష్టాలు తీర్చాలని పేర్కొన్నారు. డిగ్రీ, ఇంజనీరింగ్ పీజీ కళాశాల యాజమాన్యాలు కూడా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఫీజు రియంబర్స్మెంట్కి వసతి దీవెనకి అర్హులైన ప్రతి ఒక్క విద్యార్థినికి పరీక్షలు రాసేందుకు అనుమతించాలని, వారి సర్టిఫికెట్లు కూడా విద్యార్థులకు అంద జేయాలని తెలిపారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుర్గాప్రసాద్ చంద్రశేఖర్ పూర్ణ పాల్గొన్నారు.

రాష్ట్రంలో మొదటి ర్యాంక్ సాధించిన నిహారికను స్ఫూర్తిగా తీసుకోవాలి

విశాలాంధ్ర - పలాస : గత ఏడాది ఫలితాలలో రాష్ట్రంలో మొదటి ర్యాంక్ సాధించిన పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని నిహారిక స్ఫూర్తితో ఈ ఏడాది కూడా ఉత్తమ ఫలితాలు సాధించాలని కళాశాల ప్రిన్సిపాల్ కుప్పిలి నరసింహ మూర్తి అన్నారు. సంకల్ప్ - 2025లో భాగంగా కళాశాలలో సోమవారం జరిగిన తల్లిదండ్రుల సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. విద్యార్థుల అభ్యున్నతి కోసం అధ్యాపకులు చేస్తున్న ప్రణాళికాబద్ధ బోధనకు తోడుగా ఇంటివద్ద తల్లిదండ్రులు కూడా బాధ్యత చూపాలన్నారు. సంకల్ప్లో భాగంగా విద్యార్థులను ఎ, బి, సి గ్రేడులుగా విభజించి, సి గ్రేడ్ విద్యార్థులకు ప్రత్యేకంగా బోధన చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే ప్రతి గ్రూప్ కేర్ టేకర్ ఆయా విద్యార్థుల తల్లి దండ్రులతో వారి పిల్లల విద్యా పని తీరును వివరించారు. విద్యార్థుల నడవడికను ఇంటి వద్ద తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎంసీ బాడ వెంకటమోహన్, గ్రంథాలయ అధ్యాపకుడు పి.చిరంజీవులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఉద్యోగం కోసం ఇంటర్వ్యూలో 11 మంది హాజరు

విశాలాంధ్ర - జలుమూరు : మండల కేంద్రం సారకోట కేజీబీవీ పాఠశాలలో వివిధ పోస్టుల భర్తీకి ఉద్యోగాల కోసం సోమవారం జరిగిన ఇంటర్వ్యూలో 2009 మంది అభ్యర్థులలో దరఖాస్తు చేయగా 111 మంది హాజరయ్యారని తాసిల్దార్ కె జయలక్ష్మి ఎంపీడీవో ఎంఈఓ తెలిపారు. కొంతమంది వ్యక్తిగత కారణాల వలన హాజరు కాకపోవడంతో మరొక అవకాశం ఇస్తూ మంగళవారం ఉదయం 11 గంటలకు మిగిలిపోయిన అభ్యర్థులు తప్పనిసరిగా ఇంటర్వ్యూకి హాజరు కావాల్సిందిగా అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఏపీలో అదానీతో జరిగిన ఒప్పందాలను రద్దు చేయాలి

సీపీఐ పలాస నియోజకవర్గ కన్వీనర్ వేణుగోపాల్ డిమాండ్

విశాలాంధ్ర - పలాస : రాష్ట్రంలో కార్పొరేట్ దిగ్గజం ఆదానితో జరిగిన ఒప్పందాలను రద్దు చేయాలని సిపిఐ పలాస నియోజకవర్గం కన్వీనర్ చాపర వేణు గోపాల్ డిమాండ్ చేశారు. అదానీ అవినీతి వ్యవహారంపై సీపీఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా సోమవారం పలాస తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిహెచ్. వేణుగోపాల్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో అదానీతో జరిగిన అన్ని ఒప్పందాలను తక్షణమే రద్దు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆదానీ కుంభకోణంతో సంబంధం ఉన్న వారి పైన కూడా కఠిన చర్యలు చేపట్టాలని అన్నారు. ఆదానీ గ్రూప్ కంపెనీల అవినీతి, తప్పిదాలు, క్రోనీ కాపిటలిజాన్ని ప్రోత్సహించడంలో కేంద్ర ప్రభుత్వ పాత్రపై దర్యాప్తు చేయాలని, ఇందుకోసం సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మణిపూర్లోని హింసాత్మక పరిస్థితులపై పార్లమెంటులో చర్చించాలని అన్నారు. అధిక ధరలను అరికట్టాలని, నిరుద్యోగం నిర్మూలించాలని, జీడీపీఏ తగ్గిపోవడంపై ఆందోళన కార్యక్రమం చేపట్టామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆదాని అవినీతి కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపించాలని, గత రాష్ట్ర ప్రభుత్వ హయాంలో ఆదానితో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఆదానినీ తక్షణమే అరెస్టు చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జి.గోవింద్, తిరుపతిరావు, జే.జోగారావు, టి.రవి పాల్గొన్నారు.

కమ్యూనిస్టు విలువలకు నిలువుటద్దం 'మాదాల'

విశాలాంధ్ర - కాశీబుగ్గ : కమ్యూనిస్టు విలువలకు నిలువుటద్దం కామ్రేడ్ మాదాల నారాయణస్వామి అని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు కొనియాడారు సోమవారం పలాస సోదికొండ న్యూడెమోక్రసీ కార్యాలయంలో కామ్రేడ్ మాదాల 11వ వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు అఖిల భారత రైతు కూలీ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మాజీ పార్లమెంటు సభ్యులు కామ్రేడ్ మాదాల నారాయణస్వామి బెనారస్ విశ్వవిద్యాలయంలో ఎంఏ ఎకనామిక్స్ చదివారని శత వసంతాలు జీవించి పీడిత తాడిత ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేశారని మాధవరావు పేర్కొన్నారు. తన తమ్ముడు మాదాల కోటయ్య ఆనాడు ఎన్ కౌంటర్ లో మరణించిన మొక్కవోని దీక్షతో ఉద్యమంలో కొనసాగారని గుర్తు చేశారు.'విశాఖ ఉక్కు..ఆంధ్రుల హక్కు' అనే పోరాటంలో తన ఎంపీ సభ్యత్వానికి రాజీనామా చేశారని జీవితాంతం విప్లవకారుడుగా మాదాల నారాయణస్వామి ఆదర్శవంతమైన జీవితం గడిపారని కొనియాడారు. కామ్రేడ్ మాదాల ఆశయాలను ముందుకు తీసుకోవడం ద్వారానే ఆయనకు మనం నివాళులర్పించిన వాళ్ళమవుతామని తెలిపారు. ఐఎఫ్ టి యు జిల్లా కన్వీనర్ జుత్తు వీర స్వామి అధ్యక్షత వహించిన సభలో అఖిల భారత రైతుకుల సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడి భీమారావు పిడిఎస్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిల వినోద్ కుమార్ ఏఐకేఎంఎస్ వంకల పాపయ్య మురిపింటి తాతారావు జుట్టు కృష్ణారావు అరుణోదయ సాంస్కృతిక సమైక్య జిల్లా అధ్యక్షులు సుర్ర రామారావు పి సరస్వతి గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్దానంను కాపాడుకోడానికి మరో ఉద్యమం తప్పదు

12న రైతులకు అండగా ప్రచార యాత్ర

వామపక్ష పార్టీ నాయకులు హెచ్చరిక..!

విశాలాంధ్ర - పలాస : ఉద్దానంను కాపాడుకోవడానికి మరో ఉద్యమం తప్పదని వామపక్ష పార్టీలకు చెందిన నాయకులు ఉద్ఘాటించారు. సోమవారం పలాసలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఐ నాయకులు చాపర వేణుగోపాల్, సిపిఎం నాయకులు డి.గోవిందరావు, కె మోహన్ రావు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు వంకల మాధవరావు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు తామాడ సన్యాసిరావులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్దాన ప్రాంతంలో ఎయిర్ పోర్ట్ ఏర్పాటు కోసం బలవంతపు భూసేకరణ ఆపాలని డిమాండ్ చేశారు. లేకుంటే దీనికి వ్యతిరేకంగా ఈ నెల 12న వామపక్షాల ఆధ్వర్యంలో బాధిత గ్రామాలు పర్యటించి రైతులకు అండగా ప్రచార యాత్ర చేసేందుకు నిర్ణయించినట్లు వారు తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సముద్ర తీర ప్రాంతాన్ని కార్పొరేట్లకు కట్టబెడితే సహించేది లేదని వారు హెచ్చరించారు. జిల్లాలో పైడి భీమవరం నుండి ఇచ్ఛాపురం వరకు 193 కిలోమీటర్లు సముద్ర తీర ప్రాంతాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టడానికి పూనుకుంటున్నారని వారు ఆరోపించారు. గతంలో అభివృద్ధి పేరుతో ఈస్ట్ కోస్ట్ పవర్ ప్లాంట్ కు ప్రభుత్వం 2020 ఎకరాలు భూమిని ఇస్తే ఈస్ట్ కోస్ట్ కంపెనీ బ్యాంకులో తాకట్టు పెట్టి డబ్బులు తీసుకొని దివాలా పిటిషన్ వేస్తే ప్రభుత్వం ఆక్షన్ వేసి సమీర్ పేట్ లాజిస్టిక్ కంపెనీ కు 26 కోట్ల రూపాయలకు కారు చౌకుగా కట్టబెట్టారని విమర్శించారు. ప్రజల ఆస్తిని కార్పొరేట్ ఆస్తిగా మార్చేస్తున్నారని వారు విమర్శించారు. దీని వలన ప్రజల జీవన విధానం ధ్వంసం అయిపోతుందని అన్నారు. జిల్లా సస్యశ్యామలంగా అభివృద్ధి జరగాలంటే నీటి వనరులు అందుబాటులోకి తేవాలని, వంశధార ప్రాజెక్ట్ నిర్మించి 50 సంవత్సరాలు కావస్తున్న నేటికీ పూర్తి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వంశధార ఆధునీకరణకు 1000 కోట్ల రూపాయలు కేటాయించి శివారు భూముల వరకు నీరు అందిస్తే రెండు పంటలు పండి ప్రజల ఆదాయం పెరుగుతుందన్నారు. తద్వారా ప్రజలకు కొనుగోలు శక్తి పెరిగి వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు పెరుగుతాయన్నారు. దీని వలన ఉపాధి దొరుకుతుందని, వలసలు నివారించబడి జిల్లా అభివృద్ధి చెందుతుందని అన్నారు. వంశధార ఆధునీకరణకు ప్రభుత్వం ఎందుకు నిధులు కేటాయించడం లేదో చెప్పాలని వారు డిమాండ్ చేశారు. పెండింగ్ ప్రాజెక్టులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ అభివృద్దా! ప్రజల అభివృద్దా ? అని వారు ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ ను రాష్ట్ర ప్రభుత్వం ఆదానీ ప్రదేశ్గా మార్చేస్తుందని ఆరోపించారు. జీడి,కొబ్బరి పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు జి గోవింద్, బి.తిరుపతి, జుత్తు వీరాస్వామి మద్దిల వినోద్ పాపయ్య, తాతారావు పట్టి భీమన్న, కే.లోకనాదం, జి.జోగారావు పాల్గొన్నారు.

నరసన్నపేట - ఇచ్ఛాపురం హైవేను 6 లైన్లకు విస్తరించాలి

జాతీయ రహదారుల శాఖ అధికారులకు సూచించిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

విశాలాంధ్ర - శ్రీకాకుళం : రాష్ట్ర సమగ్ర అభివృద్ధిలో భాగమయ్యేలా స్థానిక జిల్లా మీదుగా ఉన్న జాతీయ రహదారి - 16ను మరింతగా అభివృద్ధి చేయాల్సి ఉందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అభిప్రాయం వ్యక్తం చేశారు. దీనికి అనుగుణంగా నరసన్నపేట - ఇచ్ఛాపురం మధ్య ఉన్న జాతీయ రహదారిని 6 లైన్లకు విస్తరించాలని సూచించారు. హైవే అధికారులతో విశాఖపట్నంలో జరిగిన సమావేశంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తో సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే విశాఖపట్నం - నరసన్నపేట వరకు 100 కిలోమీటర్ల మేర 6 లైన్ల జాతీయ రహదారి ఉందని, ఒడిశా సరిహద్దు ఇచ్ఛాపురం వరకు కూడా ఇదే విధంగా విస్తరణ చేపట్టాలని తెలిపారు. దీని కారణంగా ప్రయాణం, సరుకు రవాణా వేగవంతం చేయవచ్చని పేర్కొన్నారు. దీనితో పాటు నూతనంగా నిర్మాణం కానున్న భోగాపురం - మూలపేట పోర్టును అనుసంధానం చేసేలా విశాఖపట్నం - మూలపేట బీచ్ కారిడార్ రోడ్డు ప్రతిపాదనలపై పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ నిర్మాణం పూర్తయితే.. జిల్లాలోని మత్స్యకార గ్రామా లను జాతీయ రహదారితో కలపడంతో పాటు ఎగుమతులు పెరిగి.. మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంచవచ్చని వివరించారు. దీనితో పాటు శ్రీకాకుళం నగరంలోకి వాహనాలు సులభంగా రాకపోకలు సాగించేలా నవభారత్ జంక్షన్ నుంచి బైపాస్ వరకు ఉన్న జాతీయ రహదారిపై అప్రోచ్ రోడ్డు నిర్మాణం, అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించారు. దీనిపై స్పందించిన హైవే అధికారులు.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి, పనుల వేగవంతానికి కృషి చేస్తామని తెలిపారు.

నీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ లోపభూయిష్టం!

వైసీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్

విశాలాంధ్ర - ఆమదాలవలస : ఈ నెల 14 న కూటమి ప్రభుత్వం నిర్వహించ తల పెట్టిన సాగునీటి సంఘాల ఓటర్ల జాబితా తయారీ మొదలు ఎన్నికల ప్రక్రియ మొత్తం లోపభూయిష్టంగా ఉందని, ఈ ప్రక్రియ మొత్తం పునః సమీక్షించాలని ఆమదాలవలస నియోజకవర్గ రైతులు, నియోజకవర్గ వైస్సార్సీపీ నాయకులు మరియు నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ లు శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ ని కలిసి వినతిపత్రం అందించారు. ఇటీవల ఇరిగేషన్ మరియు రెవిన్యూ శాఖల అధికారులు తయారుచేసిన నాగావళి మరియు వంశధార సాగునీటి వినియోగదారుల సంఘం ఎన్నికకు సంబంధించిన ఓటర్ల జాబితాలో అనేక పొరపాట్లు కలవు. జాబితాలో ఓటర్ యొక్క చిరునామా కానీ ఎటువంటి గుర్తింపు నెంబర్ కానీ పొందుపరచలేదు. అలాగే జాబితాలో అనేక పేర్లు రెండు గాని అంతకన్నా ఎక్కువ సార్లు నమోదు అయి వున్నాయి. ఒకే ఓటర్ పేరు ఒకే సంఘంలో ఒకే ప్రాదేశికంలో రెండు మూడు సార్లు నమోదు కావడం వలన ఓటు హక్కు వినియోగంలో అనేక ఇబ్బందులు కలిగే అవకాశం వుంది. ఇప్పటివరకు ఓటర్లకు ఎన్నిక గురించి ఎటువంటి సమాచారం లేదు. అలాగే పరిశీలనలో వున్న చేతులు ఎత్తే ఎన్నిక విధానం వలన సరైన ఓటర్ తీర్పు రాదని గ్రహించాలి అని చింతాడ రవికుమార్ జిల్లా కలెక్టర్ కి వివరించారు.

వర్షాలున్నాయి ధాన్యం జాగ్రత్త పరచాలి

- ధాన్యం సేకరణకు జిల్లాలో 402 కొనుగోలు కేంద్రాలు
- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ రైతులను కోరారు

విశాలాంధ్ర - శ్రీకాకుళం : ఈ నెల 12వ తేదీ తర్వాతే వరి కోతలు, నూర్పులు చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ రైతులను కోరారు. జిల్లాలో తుఫాను బే ఆఫ్ బెంగాల్లోని తమిళనాడు నుండి ఆంధ్రప్రదేశ్ కు ఈ నెల 11, 12 తేదీల్లో వర్షాలు వచ్చే అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. సోమవారం జిల్లా పరిషత్ లో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తో కలసి ఆయన విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంట ముందుగా జరిగి కుప్పలు వేసి ఉంటే ఈ 12వ తేదీ తర్వాత నూర్పులు చేయవచ్చని రైతులను కోరారు. కోతలు కోసేవి ఉంటే వెంటనే కుప్పలు వెంటనే వేసుకోవాలని తెలిపారు. ధాన్యం నూర్చి కళ్ళాల్లో సిద్ధంగా ఉన్నట్లు తెలియజేస్తే ధాన్యం సేకరణకు మిషనరీ, మిల్లర్లు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. 54 వేల టన్నులు ధాన్యం సేకరణకు క్షేత్రస్థాయిలో ఉన్నట్లు వెల్లడించారు. పది వేల టన్నులు ధాన్యం రెండు రోజుల్లో వస్తుందని అంచనా ఉన్నట్టు చెప్పారు. 64 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనాల్సి ఉందన్నారు. రెండు రోజుల్లో మన వద్ద ఉన్న మిషనరీ, వాహనాలు, బస్తాలుతోను, మిల్లర్లు కెపాసిటీతో 30 వేల టన్నులు కొనుగోలు చేయవచ్చున్నారు. ఒక రోజులో 15 వేల టన్నులు ధాన్యం కొనుగోలు చేయవచ్చని తెలిపారు. మరో 34 వేల టన్నులు ధాన్యం ఉంటుందని, ఆ ధాన్యాన్ని సురక్షితమైన ప్రదేశాలకు తరలించాలని రైతులను ఆయన కోరారు. ఎక్కడైతే సురక్షితమైన ప్రదేశాలకు ఉండవో అలాంటి వారికి డిజాస్టర్ మేనేజ్ మెంట్ వద్ద ఉన్న నిదులు, పౌర సరఫరాల శాఖ నుండి టార్పాలిన్లు కొనుగోలు చేసి పిపిసి కేంద్రాల ద్వారా సరఫరా చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. లికుప్పలుగా ఉన్న వరి చేనులను అలాగే ఉంచాలని 12 తర్వాత మాత్రమే నూర్చుకోవాలని రైతులను కోరారు.లి రైతులకు టార్పాలిన్స్ లేవని పిపిసి కేంద్రాలకు తెలియజేయాలన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు జిల్లాలో పర్యటిస్తారన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ధాన్యం సేకరణలో ఇప్పటి వరకు ఎలాంటి సమస్య రాలేదన్నారు. ఒక వారం రోజుల ముందు మాత్రం వాహనాలు లేవని సమాచారం వచ్చిందని, ఇప్పటి వరకు జిల్లాలో 3 వేల వరకు వాహనాలు జిపియస్ తో ఉన్నట్లు వెల్లడించారు. బస్తాలు అందుబాటులో ఉన్నాయని, ఇవే కాకుండా లేబర్ కూడా అందుబాటులో ఉన్నట్లు వివరించారు. ఈ నెల 12 వరకు వరికి నష్టం జరిగే అవకాశం ఉంది. కావున రైతులు ఏ ఒక్కరూ కూడా తమ పంటలను నూర్చ వద్దు, పంట కోయ వద్దని కోరారు. కుప్పలు కుప్పలుగానే ఉంచాలని 12వ తేదీ తర్వాత నూర్చుకోవచ్చన్నారు. నూర్చే ధాన్యం సిద్ధంగా ఉంటే జిల్లాలో 402 ధాన్యం సేకరణ కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయని, వెంటనే ధాన్యం సేకరణ కేంద్రాలను సంప్రదించి ధాన్యం విక్రయించాలని కోరారు. పలాస, ఇచ్ఛాపురంలలో పంట కోత ఇంకా చేయలేదని, జిల్లాలో నరసన్నపేట, టెక్కలి, ఆముదాలవలస, ఎచ్చెర్ల, పాతపట్నం, శ్రీకాకుళంలలో కోతలు, నూర్పులు జరుగుతున్నందు వలన రైతులు వర్షాలను దృష్టిలో పెట్టుకుని పంట కోసిన, నూర్చిన ధాన్యాలను జాగ్రత్త చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో పేమెంట్స్ జరుగుతాయని, పేమెంట్స్ లో ఎలాంటి సమస్య లేదన్నారు. కొన్ని సందర్భాల్లో రెండు మూడు గంటల్లోను పేమెంట్స్ రైతుల ఖాతాల్లో లో జమ జరుగవచ్చున్నారు. రైతులకు ఎలాంటి సమస్యలు ఉన్నా జెసి, కలెక్టర్ లకు తెలియజేయవచ్చున్నారు. జిల్లాకు ఇప్పటి వరకు 4.9 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం ఉందని, ఇప్పటి వరకు 1.1 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడమైనదని, దాదాపుగా 1/4 సేకరణ జరిగిందన్నారు. గత యేడాది కంటే ఈ యేడాది ధాన్యం సేకరణ ఎక్కువ జరిగిందని, వర్షాలు పడినందు వలన పంటలు కూడా బాగా పండాయన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో 228. 73 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ అయినట్లు వివరించారు. 19 లక్షలు బస్తాలు సిద్ధంగా ఉన్నాయని, బస్తాలు, లేబర్, రవాణా ఖర్చులు రైతుల ఖాతాల్లో జమ అవుతుందన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలుకు మిల్లర్లకు తగు సూచనలు జారీ చేసినట్లు చెప్పారు. రైతులు సహకరించి ఎక్కడైనా తడిచిన ధాన్యం ఉంటే ఆరబెట్టి విక్రయించాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మిల్లర్లకు తగు సూచనలు జారీ చేసినట్లు చెప్పారు.

ప్రజలకు మమకార భాష కావాలి తెలుగు

ఆంధ్ర సారస్వతా పరిషత్ అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : తెలుగు బడి భాషగానే కాదు అమ్మ ఒడి భాష గానే చూడాలని ప్రజలు మమకారభాష గానే భావించినపుడు తెలుగు అమృత భాషగా కాలంతో పాటు నిలుస్తుందని ఆంధ్ర సారస్వతా పరిషత్ అధ్యక్షులు ప్రపంచ ప్రఖ్యాత గజల్ గాయకులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ పేర్కొన్నారు. రంగస్థలకళాకారుల రజతోత్సవ వేడుకలకు హాజరైన శ్రీనివాస్ ఆంధ్ర సారస్వతా పరిషత్ శ్రీకాకుళం శాఖ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వెలుగులు విశ్వ వ్యాప్తం చెయ్యాలని ఆంధ్రమేవ జయతే అన్న నినాదంతో ప్రపంచ స్థాయి తెలుగు మహాసభలను అనేక వ్యయ ప్రయాసలకోర్చి విజయవంతంగా నిర్వహించడం అదృష్టం అన్నారు. 2002లో భీమవరం, 2004లో రాజమండ్రి నిర్వహించామని 2026 జనవరిలో అమరావతి లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచం నలు మూలలు నుండి అతిరధ మహారధులు, యాభై దేశాల నుండి ప్రముఖులు, దేశాధినేతలు హాజరు అవుతారని ఈ సభలలో అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నట్లు అన్నారు. ఆ సభలకు సన్నాహక సభలను శ్రీకాకులం నుండి శ్రీకారం చుడుతున్నామని తేదిలను త్వరలో ప్రకటించ నున్నట్లు తెలిపారు. సభా నిర్వహనలో వివిధ అంశాలు పై సలహాలు సూచనలు స్వీకరిస్తామని అన్నారు. ఆంధ్ర సారస్వతా పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి, శ్రీకాకుళం జిల్లా సంచాలకులు లఖినాన. రవికుమార్ అధ్యక్షత న స్థానిక యుటిఎఫ్ భవన్లో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా కార్యదర్శి సంపతి రావు సౌమ్య, కోడూరి సుశీల, నియోజకవర్గ సమన్వయ కర్తలు సాహితీ వేత్తలు, కవులు పాల్గొన్నారు.

దేవీ ఆశ్రమాన్ని సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : మండలంలోని కుంచాలకురమయ్య పేటలోని దేవీ ఆశ్రమాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి సుబ్బారెడ్డి సత్తి ఆది వారం సందర్శించారు. రాజరాజేశ్వరి దేవిని, మహాలింగాన్ని, 1116 లింగాల దేవాలయాన్ని దర్శించు కున్నారు. దేవీ ఆశ్రమ విశిష్టతను పీఠాధిపతి తేజోమూర్తుల బాలభాస్కరశర్మ ఆయనకు వివరించారు.

త్యాగశీలి మీకు మీరే సాటి..పలు ప్రముఖులు కితాబ్

విశాలాంధ్ర - పోలాకి : మండల విద్యాశాఖ అధికారిగా యారబాటి వాసుదేవరావు తన ప్రాణాలను కూడా అంకితం చేసి నిలిచారని విశ్రాంత డీఈవో ఆబోతుల ప్రభాకర్ రావు మాస్టారు అన్నారు. సోమవారం పోలాకి గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సంతాపం సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు చాలా బాధాకరమని ఆయన ఆలోచనలు వేరు అని ఆయనకు ఎవరూ సాటి రారని అన్నారు. ఈయన జలుమూరు మండలంలో మండల విద్యాశాఖ అధికారిగా పనిచేసినప్పుడు అందరికీ ఆత్మీయుడిగా ఉండి ముందుకు నడిపించే వారిని వారి సేవలను ఎన్నడూ మరువలేమని కొనియాడారు. ఇటీవల విశ్రాంతి ఉద్యోగి యారబాటి వాసుదేవరావు సాయంకాలం వాకింగ్ సమయంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన తెలిసిందే. ఆయన ఆశయాలకు అనుగుణంగా పెన్షన్ డే సందర్భంగా ఈనెల 17వ తేదీన ఐదుగురు విశ్రాంతి ఉద్యోగులకు సీనియర్లకు సాయంకాలం 3 గంటలకు సన్మాన సభ ఉన్నట్లు ప్రకటించారు. ఈ సంతాప సభకు స్థానిక సర్పంచ్ మజ్జి రమణమ్మ, లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీడీవో జగదీశ్వరరావు, యారపాటి రామారావు, మినీ గ్రంథాలయాధికారి తాడి ఎర్రయ్య, రంగారావు, మధుసూదన్ రావు, లక్ష్మణరావు, కొండలరావు, విశ్రాంత ఉద్యోగులు వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

సమస్యల పరిష్కారానికై రెవెన్యూ సదస్సులు

విశాలాంధ్ర - కవిటి : రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఇది ఒక మంచి వేదిక అని తహశీల్దార్ బెహరా మురళీమోహనరావు అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని డీజీపుట్టుగ గ్రామంలో రెవెన్యూ సదస్సులో తహసిల్దార్ బి మురళీమోహన రావు పాల్గొని మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భూ బదలాయింపులు కాకుండా ప్రతి ఒక్కరూ భూములను విక్రయించిన, ఏ ఇతర కారణాలతో బదలాయింపు చేసిన రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. మొత్తం 25 దరఖాస్తులు అంది నట్లు వాటిని త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప తహసిల్దార్ ఎం కృష్ణ మూర్తి, ఆర్ఐ రమణమూర్తి, స్థానిక సర్పంచ్ ప్రతినిధి బెం దాళం జయప్రకాశ్, ఎంపీటీసీ సభ్యులు చందాన పూర్ణ చంద్రుడు, కూటమి నాయకులు బెందాళం రమేష్, సిపాన వెంకట రమణ, పొందల కృష్ణారావు, బెందాళం తిరుమలకుమార్, పండి దేవేంద్ర మూర్తి, బార్ల చిన్నబాబు, పుల్లట రాజు, వీఆర్వోలు పాల్గొన్నారు.

స్థాపన : 1952
విశాలాంధ్ర
తెలుగు జాతీయ దినపత్రిక
విలేకరులు కావలెను
కావాల్సిన ప్రాంతాలు :
సంప్రదించవలసిన నెం :
సనపల రమేష్, జిల్లా బ్యూరో చీఫ్
7569642555

వంతెనల నిర్మాణ పనులు త్వరితగతిని పూర్తి చేయాలి

జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ సాయిరాజ్

విశాలాంధ్ర - కవిటి : ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలో వంతెనల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ సాయిరాజ్ జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రం లోని కలెక్టర్ కార్యాలయంలో కలసి వినతి పత్రం అందజేశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలో గత ప్రభుత్వ హయాంలో వివిధ వంతెనలను ప్రతిపాదించి సాంకేతిక అనుమతులు, పరిపాలన,ఆర్థిక అనుమతులు మంజూరు చేసి టెండర్లకు పిలవడం జరిగిందని జిల్లా కలెక్టర్‌కు విజయ సాయిరాజ్ వివరించారు. ఇచ్ఛాపురం మున్సిపల్ పట్టణాన్ని కలుపుతూ బహుదా నదిపై కొత్త వంతెన నిర్మాణం కు 20 కోట్లు,బారువ కొండిరేవు పై వంతెన నిర్మాణం 3.45 కోట్లు, బారువ టౌన్ సమీపంలో మహేంద్రతనయ నదిపై వంతెన నిర్మాణం కు 14.60 కోట్లుతో వంతెనలు గత ప్రభుత్వ హయాంలో టెండర్లను పిలవడం జరిగిందని అన్నారు. ఆ దశలో ఆగిన వంతెనలు ప్రజోపకారం దృష్ట్యా, సత్వరమే వంతెనలను నిర్మాణం చేపట్టి పూర్తి చేయాల్సిన అవసరం ఉన్నదని కోరారు. ఈ విషయాలపై జిల్లా కలెక్టర్ వారు సానుకూలంగా స్పందించినట్లు విజయ తెలిపారు.

రైతులు సమస్యలు పరిష్కరిస్తాం

విశాలాంధ్ర - నందిగాం : గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా రైతుల సమస్యల పరిష్కరిస్తామని తహసిల్దార్ సోమేశ్వరరావు అన్నారు. రాంపురం, బెల్లుకోలా బైరిబద్దపాడు, గ్రామాల్లో సోమవారం ఉప తాసిల్దార్ రామారావుతో కలిసి రెవెన్యూ సదస్సులు జరిపారు. బెల్లుకోలా, బైరిబద్దపాడు గ్రామాల్లో ఉన్న అటవీ భూములను రాంపురంలో ఉన్న ఖాళీ స్థలాన్ని వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సింహాచలం సర్వేరు యు.రామారావు పాల్గొన్నారు.

ఆశ్రమ వృద్ధులకు, అనాథలకు దుప్పట్లు వితరణ

విశాలాంధ్ర - సోంపేట : జాగృతి స్వచ్ఛంద సేవా సంస్థ గౌరవ అధ్యక్షులు రాంబుడ్డి గణపతి సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం సీతయ్య ఫౌండేషన్ వృద్ధాశ్రమం సందర్శించి అక్కడ ఆశ్రయం పొందుతున్న వయోవృద్ధులకు, అనాథలకు 30 చలిదుప్పట్లను వితరణగా అందజేశారు. దాతలు దక్షత లేనటువంటి వయోవృద్ధులుకు మరింత సహాయం చేయుటకు ముందుకు రావాలని పరోపకారమే మనిషి తత్వం కావాలని కోరుకుంటూ ఈ కార్యక్రమంలో కొర్లాం గ్రామానికి చెందిన రత్నాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. వృద్ధాశ్రమం సేవలో తరించి చలి దుప్పట్లును వితరణగా అందజేసిన జాగృతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులకు సీతయ్య ఫౌండేషన్ తరపున సంస్థ నిర్వాహకులు గుల్ల మోహనరావు, గుల్ల రమేష్‌లు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

పలు రంగాలకు ప్రయోజనకారిగా బయోటెక్నాలజీ ఆవిష్కరణలు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : శాస్త్ర, వైద్య, పర్యావరణ, వ్యవసాయ తదితర రంగాలకు బయోటెక్నాలజీ అధ్యయనాలు బహుళ ప్రయోజనకరమని మానిటోబా యూనివర్సిటీ (కెనడా) హెల్త్ సైన్స్ విభాగం అధ్యాపకులు ప్రొఫెసర్ చెలికాని ప్రసేన్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో సోమవారం బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఆవిష్కరణలు, వైద్య శాస్త్రం, ప్రపంచ ఆరోగ్యం లో పరిణామాలు అనే అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ వర్క్షాపులో ఆయన మాట్లాడారు. సాంకేతిక ప్రగతితో, బయోసైన్స్ పరిశోధనలు కొత్త పుంతలు తొక్కుతున్నాయని చెప్పారు. ఆరోగ్య సవాళ్లతో పోరాడేందుకు నూతన, అసాధారణ మార్గాల్లో డిజిటల్ సాంకతికత ఇక ఇంధనంగా ఉపయోగపడుతుందన్నారు. పలు వ్యాధుల అడ్డుకట్టకు బయోటెక్నాలజీ రంగం ఆవిష్కరిస్తున్న నూతన వ్యాక్సిన్లు దోహదపడుతున్నాయని చెప్పారు. వర్చువల్ మోడ్లో పాల్గొన్న అలబామా యూనివర్సిటీ (అమెరికా) హేమటాలజీ, అంకాలజీ విభాగం అధ్యాపకులు డాక్టర్ జి.పూర్ణచంద్ర నాగరాజు మాట్లాడుతూ జెనిటిక్, ఇంజనీరింగ్ ద్వారా రీకాంబినేషన్ డీఎన్ఏ, జీన్ క్లోనింగ్, జీన్ ట్రాన్స్ఫర్ అంశాల్లో అధ్యయనాలు అధికమయ్యాయని తెలిపారు. అంతర్లీనంగా అభివృద్ధి చెందుతున్న పలు కేన్సర్లను అడ్డుకునేలా ప్రత్యామ్నాయ మార్గాలు వెతుకుతున్న అధ్యయనాలు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. బీఆర్ఏయూ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని మాట్లాడుతూ జన్యు సంబంధిత వ్యాధులు చేదించడానికి మరిన్ని వె రుగైన పరిశోధనలు జరగాల్సి ఉందన్నారు. డీఎంహెచ్వో డాక్టర్ బి. మీనాక్షి, ఏయూ బయోటెక్నాలజీ విభాగం అధ్యాపకులు ప్రొఫెసర్ పీఎస్వీ ధనుంజయ మాట్లాడుతూ మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ రంగాలకు కూడా నేడు బయోటెక్నాలజీ అధ్యయనాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమ కన్వీనర్, వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, వర్సిటీ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్, డాక్టర్ ఎం. అనూరాధ, డాక్టర్ సిహెచ్. రాజశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 11, 12 తేదీల్లో తపాల జీవిత బీమా మేళా

సుపరెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీస్ వండాన హరిబాబు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : శ్రీకాకుళం తపాలా డివిజన్ పరిధిలోని అన్ని పోస్టాఫీసులలో డిసెంబర్ 11 12వ తేదీలలో తపాలా జీవిత భీమా(పి ఎల్ ఐ) మరియు గ్రామీణ తపాలా జీవిత భీమా(అర్ పి ఎల్ ఐ) మెగా మేళాను నిర్వహిస్తున్నట్లు సుపరెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీస్ వండాన హరిబాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో 2కోట్ల ప్రీమియం సమీకరణే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని, భారతదేశంలో ప్రతి 100 మందిలో 30 మందికి మాత్రమే జీవిత బీమాను కలిగియున్నారనితెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ప్రతి ఒక్క పౌరునికి జీవిత బీమాను అందించాలనే లక్ష్యంతో ప్రతిఒక్క పోస్టాఫీసు పనిచేస్తుందన్నారు. పోస్ట్ఆఫీసులు అందించే జీవితభీమాలు అతితక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్ ను అందిస్తున్నాయని , సేవింగ్ ఖాతా మాదిరిగానే పోస్టాఫీసులు అందించే జీవితభీమాలు ఎక్కువ బోనస్ ను ఆర్జిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరు ఈ సేవలను మీ యొక్క సమీప పోస్టాఫీసులలో వినియోగించుకుని, తపాలా జీవిత భీమా మరియు గ్రామీణ తపాలా జీవిత భీమాలను పొంది వారి కుటుంబాలకు భరోసా కల్పిస్తారని ఆశిస్తున్నట్లు ప్రకటనలో తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలవిద్యార్థులు

విశాలాంధ్ర - కవిటి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ వారు నిర్వహిస్తున్న కళా ఉత్సవ్ 2024 పోటీలలో భాగంగా జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలలో కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరు విభాగాలకు గాను ఐదు విభాగాలలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. ఈ మేరకు జానపద నృత్యం గ్రూపు, జానపద గీతం గ్రూపు, డ్రామా గ్రూపు, 3డి ఆర్ట్, ఇన్స్ట్రుమెంటల్ మ్యూజిక్ గ్రూపు విభాగాలలో ప్రభుత్వ పాఠశాల కవిటి విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. వీరికి శిక్షణ ఇచ్చిన పీ.టీ.కే. శర్మ, యు.గిరిబాబు, ఎస్.ఎకాంబరీశ్వర శర్మ లను స్థానిక సర్పంచ్ పూడి లక్ష్మణరావు, పాఠశాల హెచ్ఎం బి.మల్లేశ్వరరావు, ఉషోదయ యువజన సంఘ అధ్యక్షులు పాండవ చంద్రశేఖర్, బెందాలం రమేష్, బెందాలం తిరుమల కుమార్, ఆరంగి మధు, ఎస్.ఎం.సి చైర్మన్ తెప్పల మోహనరావు, విద్యార్థులకు అభినందించారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి : తహశీల్దార్ వెంకట్రావు



విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : సోమవారం రెవిన్యూ సదస్సును ఏ.ఎస్.పేటలో నిర్వహించారు. చాలా ఏళ్ళుగా భూములకు సంబంధించిన అంశాలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే రెవిన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని భూ సమస్యలు పరిష్కరించుకోవాలని తహశిల్దార్ వెంకట్రావు ఈ సందర్భంగా ప్రజలను కోరారు. 3వ వార్డు పరిధిలో నిర్వహించిన సదస్సులో భూములకు సంబందించి 27 దరఖాస్తులు రాగా, వాటిల్లో మ్యుటేషన్లు, 1బి-అడంగల్స్ సరిచేయాలని రైతులు కోరారు. దీంతో పాటు సొంత భూములకు సర్వే నెంబర్లు తప్పు వద్దాయని, కొన్ని భూములకు అడంగల్ కాపీలు రావట్లేదని ప్రజలు తెలిపారు. తహశీల్దార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవిన్యూ సదస్సులు ద్వారా ప్రతీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని అన్నారు. ఈ సదస్సులో రీసర్వే డి.టి కిరణ్, ఆర్.ఐ క్రిష్ణ, వార్డు కౌన్సిలర్ వత్రి తవిటయ్య, టి.డి.పి రాష్ట్ర కార్యదర్శి సాలిన ఢిల్లీ తదిత రులు పాల్గొన్నారు.

నేడు 'గరిమెళ్ళ' కవితా స్రవంతి ఆవిష్కరణ

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : జాతీయ గేయ కవిత సార్వభౌముడు గరిమెళ్ళ సత్యనారాయణ రచించిన కవితల సంకలనాన్ని మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రియాగ్రహారంలో ఆవిష్కరిస్తున్నట్టు అరసం జిల్లా కార్యదర్శి చింతాడ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రగతి సాహితీ సంస్థ వ్యవస్థాపకులు ఇల పండ గణపతి రావు అధ్యక్షతన జూనియర్ కళాశాల ఆవరణలో కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రిన్సిపాల్ ఎస్ ఎస్ నాగ కుమారి చేతుల మీదుగా ఆవిష్కరణ జరుగుతుందని, ఇదే కార్యక్రమంలో నల్లి ధర్మారావు రచించిన'మాకొద్దీ తెల్ల దొరతనం' నాటిక పరిచయ కార్యక్రమం కూడా ఉందన్నారు. హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్ రాజేశ్వరరావు ఈ కార్యక్రమం ముఖ్య అతిథిగా హాజరవుతారని, గిడుగు రామమూర్తి జానపద కళాపేతం అధ్యక్షులు బద్రి కుర్మారావు,అరసం విజయనగరం జిల్లా కార్యదర్శి రత్నాల బాలకృష్ణ, గరిమెళ్ళ శతజయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్ బాదాన రాజు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్ ఈశ్వరరావు, ఇస్కఫ్ జిల్లా అధ్యక్షులు ఎంవి మల్లేశ్వరరావు, సామాజిక కార్యకర్త దుబ్బ కోటేశ్వరరావు అతిధులుగా హాజరవుతారని తెలిపారు.

అమ్మవారి ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం

విశాలాంధ్ర - జలుమూరు : మండల కేంద్రంలో సార్వకోట ఉజ్జయిని మ హంకాళి అమ్మ వారు ఆవరణలో భవానీ భక్తుడు సారవకోట చైతన్య కుమార్ అన్నప్రసాద కార్యక్రమాన్ని భవా నీలకు బంధువులకు నిర్వహించారు. అంగరంగ వైభవంగా ఆనందంగా గురుస్వాములు ఆశీ స్సులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతిరోజు ఒక్కొక్క స్వామి ఇక్కడ అన్నప్రసాద్ వితరణ ఏర్పాటు చేయడం పలువురు ఆనంద వ్యక్తపరిచారు.

ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులు విక్రయం

విశాలాంధ్ర - సోంపేట : సోంపేట మండలం పలాస పురం యూనిట్ మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులు విక్రయించారు. స్థానిక మండల రెవెన్యూ ఆఫీసర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన పంటలు ఆరోగ్యకరమని అన్నారు. ఈ సందర్భంగా మండల యాంకర్ కుమారి మాట్లా డుతూ తక్కువ పెట్టుబడితో సాగు చేయటం ఎక్కువ దిగుబడి రావడమే కాకుండా ఆరోగ్యంగా వుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో, డిప్యూటీ ఎమ్మార్వో, పలాసపురం సర్పంచ్ జోగారావు, మండల సర్పంచులు, ఐసిఆర్‌పిలు కృష్ణవేణి, జయలక్ష్మి, సుజాత, శ్రావణి, పుష్పలత, స్వాతి, మహేష్ పాల్గొన్నారు.

ఎస్పీ ఫిర్యాదుల విభాగానికి 64 వినతులు

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : ప్రజా పిర్యాదులు చట్ట పరిధిలో పరిష్కారం చూపాలని అదనపు ఎస్పీ కెవి రమణ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పిర్యాదులు స్వీకరణ, పరిష్కార కార్యక్రమంలో 64 పిర్యాదులు అందాయి. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయం లోను జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఆదేశాలు మేరకు అదనపు ఎస్పీ కెవి రమణ ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి 64 పిర్యాదులు స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి, ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు.

సంక్రాంతి ముందే వచ్చింది

- 48 గంటల్లో రైతు ఖాతాల్లో నగదు జమ చేస్తున్నాం
- శ్రీకాకుళంలో రూ.40 కోట్లతో ధాన్యం ఆరబెట్టే పరిశ్రమను ఏర్పాటు చేస్తాం
- పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

విశాలాంధ్ర - రణస్థలం/ లావేరు : 'రాష్ట్రంలో రైతులందరికీ సంక్రాంతి ముందే వచ్చింది. ధాన్యాన్ని సేకరించిన 24 నుంచి 48 గంటల్లోనే వారి ఖాతాల్లో నగదు జమ చేస్తున్నాం. దళారులకు ధాన్యాన్ని విక్రయించుకోవద్దు. ప్రతి గింజా కొంటాం. మీ ఇబ్బందులు చూసి కొనుగోలు నిబంధనల్లో రైతుకి పూర్తి ప్రయోజనం కలిగేలా మార్పులు చేయాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశించారని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. లావేరు మండలం బుడుమూరు గ్రామ పంచాయతీ కలిశెట్టి గూడెంలో సోమవారం మధ్యాహ్నం ఆయన పర్యటించారు. అక్కడే ధాన్యం కొనుగోలు కేంద్రం పనితీరును స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'అకాల వర్షాల దృష్ట్యా తేమ శాతం పెంచాం. ధాన్యం కొన్న 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బు వేస్తున్నాం, రైతుల్లో ధైర్యం నింపేలా వారి దగ్గరకు వెళ్తున్నాం. 17శాతానికి మించి తేమ ఉంటే ధాన్యం కొనక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్న సమాచారంతో వాటిలో మార్పులు చేసి ధాన్యంలో 24-25 తేమ శాతం ఉన్నా కొనుగోలు చేయాలని ఆదేశాలిచ్చా' మన్నారు. శ్రీకాకుళంలో రూ.40 కోట్లతో ధాన్యాన్ని ఆరబెట్టి ఎండబెట్టే పరిశ్రమను నెలకొల్పుతామని, ఉత్తరాంధ్ర జిల్లాల రైతులకు ఈ పరిశ్రమ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో మడ్డువలస, తోటపల్లి కాలువలను ఆధునికరించే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు. వాట్సాప్ లో రైతు హాయ్ అని పెడితే వ్యవసాయ శాఖకు సంబంధించిన మొత్తం సమాచారం అందేలా ఏఐ టెక్నా లజీని రూపొందించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణను లక్ష్యంగా నిర్ణయించుకుంటే సుమారు 5 లక్షల మెట్రిక్ టన్నులను ఒక్క శ్రీకాకుళం జిల్లా నుంచే సేకరిస్తున్నామని మనోహర్ చెప్పారు. శ్రీకాకుళం జిల్లా నుంచి వలసల నివారణ ధ్యేయంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ ఈశ్వరరావు మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో సాగునీటి కష్టాలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని తొలగిస్తే రైతుకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని కోరారు. తోటపల్లి, నారాయణపురం, మడ్డువలస కాలువలను గత ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ లు మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో రైతులకు ధాన్యం కొనుగోలు కింద రూ.36 కోట్లు వారి అకౌంట్లలో జమ చేశామని దాదాపు 1.1 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని వివరించారు. ఈనెల 11వ తేదీ నుంచి వర్షాలు పడే అవకాశం ఉన్నందున ఆ తర్వాత కోతలు, నూర్పులు చేయాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. పూర్తి స్థాయిలో గోనెలు, టార్పాలిన్లు అందు బాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కోరాడ త్రినాధ స్వామి, సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్, పౌరసరఫరాల శాఖ అధికారులు, బెజ్జపురం యూత్ క్లబ్ చైర్మన్ ప్రసాద రావు మాస్టారు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర - మందస : గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.ధర్మారావు, సహాయ కార్యదర్శి ఎస్.పాల్గొణరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎస్ గురునాథ్ లు కోరారు. ఈ మేరకు సోమవారం మందస తహసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఇటీవల జరిపిన సమగ్ర సర్వేలో గిరిజన గ్రామాల్లో సమస్యలు వెలుగు చూశాయని తెలిపారు. అనేక గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు లేవని, గిరిజనుల భూములకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక గ్రామాలలో సామాజిక భవనాలు గాని, అంగన్వాడీ కేంద్రాలు గాని లేవని, సాగునీరు, త్రాగునీరు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. భూ ఆక్రమణలు అధికంగా ఉన్నాయని గిరిజనుల భూములు గిరిజ నేతరులు ఆక్రమిస్తూ, అడ్డుకున్న గిరిజనులపై దాడి చేస్తున్నారని, పోలీసులు తిరిగి గిరిజనులపైనే కేసులు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఐటీడీఏ లేక గిరిజన గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని,ఇప్పటికైనా ప్రభుత్వం గిరిజన గ్రామాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. మందస కేంద్రంగా ఐటిడిఏ ఏర్పాటు చేయాలని, గిరిజన గ్రామాలను షెడ్యూల్ జాబితాలో చేర్చాలన్నారు. 50 శాతం గిరిజనులు ఉన్న అన్ని గ్రామాలను నోటిపై చేయాలని, అన్ని గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు అయినటువంటి త్రాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, అర్హులందరికీ రేషన్ కార్డులు పింఛన్లు, పక్కా ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సామాజిక భవనాలు అన్ని గిరిజన గ్రామాల్లో నిర్మించాలని, కొండలోగాం, చీపి, సాబకోట, హంసరాలి తదితర పంచాయతీల్లో భూ ఆక్రమణలో అరికట్టాలని ఈ సందర్భంగా జరుగుతున్న దాడులను నుండి గిరిజనులకు రక్షణ కల్పించాలన్నారు. ఇప్పటికే గిరిజనేతరులు ఆక్రమించుకున్న గిరిజన భూములను తిరిగి గిరిజనులకే అప్పగించాలని,గిరిజనులు అధికంగా ఉన్న పంచాయతీలను గిరిజన పంచాయతీలుగా ప్రకటించాలని కోరారు. అన్ని గిరిజన గ్రామాలకు ఎత్తిపోతలు కాలువల ద్వారా సాగునీరు అందించాలని, మందస, పలాస గ్రామాల సరిహద్దుల్లో భూవివాదాలతో పాటు రాష్ట్ర సరిహద్దు సమస్య గా ఉన్న గిరిజన గ్రామాల్లో పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. అవసరం ఉన్న అన్ని గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు నిర్మించి అందుబాటులోకి తేవాలని, మండల కేంద్రం నుండి గిరిజన గ్రామాలకు వెళ్లే అన్ని రోడ్లకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని కోరారు.సాగులో ఉన్న పోడు భూములు, బంజరు భూములకు పట్టాలు మంజూరు చేయాలని, పాడైన స్కూల్ భవనాలను, అంగన్వాడీ భవనాలను మరమ్మతులు చేపట్టాలని కోరారు. అన్ని గిరిజన గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో అర్హులందరికీ జాబ్ కార్డులు ఇవ్వాలని, 200 రోజులు పని దినాలు కల్పించి రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజనులు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, గిరిజన ఉత్పత్తుల ఆధారంగా ప్రాసెసింగ్ యూనిట్స్ ఏర్పాటు చేసి గిరిజనులకు ఉపాధి కల్పించాలన్నారు. గిరిజన గ్రామాలలో స్మశానాలకు వెళ్ళే దారి మార్గం కల్పించాలని, స్మశానంలో షెడ్లు ఏర్పాటు చేసి స్మశానం లేని గ్రామాలకు స్మశానానికి స్థలం కేటాయిం చాలని కోరారు. గిరిజన పంచాయతీల్లోని సచివాలయాల్లో ఖాళీగా ఉన్న స్థానాల్లో ఇన్ చార్జులను కాకుండా పూర్తి స్థాయిలో అధికారులను, వివిధ స్థానాల్లో ఖాళీగా పోస్టులను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జీడి రైతు సంఘం కన్వీనర్ తెప్పల. అజయ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి మట్ట ధర్మారావు, గిరిజన సంఘం నాయకులు ఎస్.భావన, ఎస్.గురుమూర్తి, ఎస్.వరశురాం, ఎస్.నితిన్, మోహన్‌రావు, కైలాస్ దితరులు పాల్గొన్నారు.

పథకం ప్రకారమే దాడి చేసి హతమార్చారు

హత్య కేసును చేధించిన సిఐ పైడపునాయుడు, ఎస్.ఐ జనార్ధన్ లను అభినందించిన డిఎస్పీ

విశాలాంధ్ర - గార : మండలంలోని శ్రీకూర్మంలో జరిగిన హత్య కేసును పోలీసులు చేధించారు. భూ వివాదాలే హత్యకి కారణమని తేల్చారు. పథకం ప్రకారమే ఈ హత్య చేసినట్లుగా గుర్తించారు. ఈ మేరకు హత్యకి పాల్పడ్డ 8 మంది నిందితులను అరెస్ట్ చేసారు. వారి వద్ద నుంచి 3గొడ్డళ్ళు, 3 కత్తులు,2 కర్రలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శ్రీకాకుళం డిఎస్పీ వివేకానంద తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ నెల 6వ తేదిన సాయంత్రం 7 నుంచి 7.30గంటల ప్రాంతంలో శ్రీకూర్మం గ్రామంలో సుమారు 8 మంది వ్యక్తులు కత్తులు, గొడ్డలి తీసుకుని ముగ్గురు వ్యక్తులపై విచక్షణ రహితంగా దాడి చేసారన్నారు. ఈ దాడిలో రాజేష్ అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తి రాముకి తీవ్రగాయాలు కావడంతో విశాఖపట్నం కెజిహెచ్ లో చికిత్స పొందుతున్నారన్నారు. మరొక మహిళ సరోజనికి కూడా గాయాలయ్యాయన్నారు. ఈ సంఘటనపై గార పోలీసులకి సమాచారం అందడంతో ఎస్.ఐ జనార్ధన్ సంఘటనా స్థలానికి చేరుకున్నారన్నారు. జిల్లా ఎస్పీ మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు తాను, శ్రీకాకుళం సి.ఐ పైడపునాయుడు ఘటనా స్థలానికి వెళ్ళి హత్య జరిగిన తీరుపై విచారణను చేపట్టామన్నారు. స్థానికుల చెప్పిన వివరాల ఆధారంగా నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసామన్నారు. వారు అన్ని కోణాలలో దర్యాప్తు నిర్వహించగా భూ వివాదాల కారణంగానే హత్య చేసినట్లుగా వెలుగుచూసిందన్నారు. పథకం ప్రకారం నింధితులు అంతా కలసి రాజేష్, రాము, సరోజనిలపై దాడి చేసారన్నారు. గతంలో కూడా వారు రాము అనే వ్యక్తిపై దాడికి పాల్పడి హత్య చేయడానికి ప్రయత్నించారన్నారు. అప్పట్లో వారిపై కేసు నమోదు చేసి జైలుకి పంపించడం జరిగిందన్నారు. తాజాగా హత్యకి పాల్పడడంతో పాటు మరో ఇద్దరని హతమార్చేందుకు యత్నించిన కొయ్య భాస్కరరావు, కొయ్య రమేష్, కొయ్య లోకేష్, గుజ్జు లక్ష్మణ, గుజ్జు రామారావు, కొయ్య గురయ్య, కొయ్య సాయికిరణ్, గుజ్జు శ్రీనులు 8 మందిని అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించామన్నారు. ఈ కేసు చేధించడంతో సి.ఐ పైడపు నాయుడు, ఎస్.ఐ జనార్ధన్ లు విశేషంగా కృషి చేసారని డిఎస్పీ వివేకానంద ప్రశంసించారు. ఈ సమావేశంలో సి.ఐ పైడపునాయుడు, ఎస్.ఐ జనార్ధన్ లు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎచ్చెర్ల ఎస్ఐ వి. సందీప్ కుమార్ అన్నారు. ముద్దాడ జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం సంకల్పం పేరిట నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చెడు వ్యసనాల వల్ల జీవితాలు పాడవుతాయని చెప్పారు. అబ్దుల్ కలాం చెప్పినట్టు కలలను కని వాటిని సాకారం చేసుకునేలా చదువుకోవాలన్నారు. విద్యార్థి చాలా కీలకమైందని, క్రమశిక్షణతో చదువుకుని లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

300 ఒడిస్సా సారా ప్యాకెట్లు సీజ్

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : ఒడిశా నుండి అక్రమంగా తరలిస్తున్న 300 ప్యాకెట్ల నాటు సారాను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసారు. సోమవారం మధ్యాహ్నం తనిఖీలు నిర్వహిస్తుండగా గొర్లపాడు జంక్షన్ వద్ద స్కూటీ పై ఒడిశాక చెందిన లావణ్య దొళై సారా ప్యాకెట్లు తరలిస్తుండటాన్ని గుర్తించి అతన్ని, స్కూటీతో పాటు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి దుర్గాప్రసాద్ తెలిపారు. లైసెన్సులు పొందిన మద్యం దుఖాణదారులు అధిక ధరలకు మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలిపారు. అధిక ధరలకు అమ్మకాలు జరిపినా, నాటుసారా విక్రయాలు జరిపినా 8639959250, 9440830285నెంబర్లుకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

బెజ్జిపల్లి రైతు సేవా కేంద్రంలో ఖాళీగా కార్యదర్శి, వీఆర్‌వోల కుర్చీలు

- సమయానికి రాని సిబ్బంది
- అవకాశముంటే విధులకు డుమ్మా

విశాలాంధ్ర - నందిగాం : ప్రజల సమస్యలను ఉన్నఫలంగా పరిష్కరించి వారికి చేదోడు వాదోడుగా ఉన్న గ్రామ సచివాలయం సిబ్బంది అసలు విధులకు రావడమే లేదు గత ఐదేళ్లుగా పర్యవేక్షణ లేక ఇష్ట రాజ్యంగా వ్యవహరించిన గ్రామ సచివాలయ సిబ్బంది ప్రభుత్వం మారిన్పటికీ తమ పనితీరు మార్చుకోవడం లేదు. దొరికితే దొంగ దొరకకపోతే దొరగా మారుతున్న సిబ్బందిని ప్రభుత్వ అధికారులు పర్యవేక్షణ చేసి సక్రమ మార్గంలో నడిపించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. సోమవారం ఉదయం 10:30 గంటలకు మండలం బెజ్జిపల్లి గ్రామ రైతు సేవా కేంద్రంలో ఉన్న గ్రామ సచివాలయాన్ని విశాలాంధ్ర న్యూస్టుడే సందర్శించగా నమ్మలేని నిజాలు బయటపడ్డాయి. సచివాలయంలో వెల్ఫేర్ ఇంజనీరింగ్ వెటర్నరీ అసిస్టెంట్లు మాత్రమే ఉన్నారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ వెటర్నరీ లీవ్ పై ఉన్నారు. హెల్త్ అసిస్టెంట్ పోస్ట్ ఇక్కడ ఖాళీ. పంచాయతీ కార్యదర్శులు ఇద్దరు (కర్లపూడి బెజ్జిపల్లికి చెందినవారు అందులో కన్వీనర్‌గా బెజ్జిపల్లి కార్యదర్శి)లేరు. వీఆర్వో లేరు. మహిళా పోలీస్ లేరు. ఇలా ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా తయారైవుంది. 11 గంటల వరకు వస్తారేమోనని విశాలాంధ్ర చూడగా ప్రయోజనం కాన రాలేదు. మూమెంట్ రిజిష్టర్ అడిగితే పంచాయతీ కన్వీనర్ వద్ద ఉందని అక్కడ ఉన్న సిబ్బంది పేర్కొన్నారు. అంటే మూమెంట్ రిజిష్టర్ సైతం మెయింటినెన్స్ చేయడం లేదన్నది స్పష్టమవుతుంది.

- కఠిన చర్యలు చేపడుతాం...ఎంపీడీవో

గ్రామ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకపోతే కఠిన చర్యలు చేపడుతాం. మూమెంట్ రిజిష్టర్ సచివాలయంలోనే ఉంది. బయటకు వెళ్లాలంటే అందులో వివరాలు పొందివరచాలి కన్వీనర్ ని విచారించి తగు చర్యలు తీసుకుంటాం టి.రాజారావు ఎంపీడీవో నందిగాం.

కుల మతాల బేధం లేకుండా కలిసి మెలిసి ఉండండి

విశాలాంధ్ర - హిరమండలం : ప్రతీ గ్రామం లో కుల మత బేధం లేకుండా ప్రజలందరు కలిసి మెలిసి ఉండాలని మండలతహసీల్దార్ ఎన్ హనుమంత్ రావు, కొత్తూరు సీఐ చింతాడ ప్రసాద్‌లు మండలం లోని భగీ రధిపురం కోలని లో సోమవారం ఉదయం గ్రామ స్తులుతో గ్రామ సభ నిర్వహించారు, ఈసందర్భంగా తహసీల్దార్, సీఐ మాట్లాడు చూ గ్రామంలో ప్రశాంతమైన వాతావరణం ఉండాలని ఎవరైనా ప్రశాంతంతకు భంగం కలిగిస్తే అటువంటి వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని రాజకీయకక్షలు తో జీవితాలను నాశనం చేసుకో వద్దని కోరారు. ప్రతీ ఒక్కరూ అహం విడిచి పెడితే ప్రతీ ఒక్కరు తో కలిసి మెలిసి ఉండొచ్చునని తెలియజేశారు. జీవితం చాలా చిన్నదని ప్రతీ ఒక్కరూ గొడవ లకు పోకుండా ఇంటి ని అభివృద్ధి చేసుకొని సమాజం లో మంచి పేరు ప్రఖ్యతలు తెచ్చుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలోసర్పంచ్ వంజరావు చిరంజీవి, గ్రామ పెద్దలు, ఎస్సై మహమ్మద్ యాసిన్, ఆర్ఐ ఉమాశంకర్ రావు, రెవిన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

విశాలాంధ్ర - కవిటి : మండలంలోని కుసుంపురం గ్రామంలో సిసి రోడ్లు నిర్మాణం పనులు కూటమి నాయకులు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ అభివృద్ధికి పెద్దపీట వేసిందని అన్నారు. ప్రతి మారుమూల గ్రామానికి సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ దివ్య, కూటమి నాయకులు బత్తిని కృష్ణారావు, అంగ సురేష్, సింధుల గున్నయ్య, కీలు లోహీదాసు, ఇద్ది బాబురావు, మోహన్ దొళాయి, రమేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ గర్భిణీకి వైద్య పరీక్షలు తప్పనిసరి

విశాలాంధ్ర - హిరమండలం : ప్రతీ గర్భిణీకి ప్రతీ నెల క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు, వైద్య సలహాలు తీసుకొవాలని చొర్లంగి పి హెచ్ సి వైద్యా ధికారులు డాక్టర్ ఎం యశ్వంత్ కుమార్, డాక్టర్ కె సంతోష్ కుమార్ లు అన్నారు. సోమవారం చొర్లంగి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం లో ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమం ద్వారా 32 మంది గర్భిణీ స్త్రీలకు వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు, ఉచిత ఐరన్ మందులను అందజేశారు. ఈ సందర్భంగా వైద్యా ధికారులు మాట్లాడుతూ ప్రతీ నెల 9వ తేదిన పి ఎంఎస్ఎంఎ ద్వారా గర్భిణీ స్త్రీ లకు జేమ్స్ ఆసుపత్రి వైద్యు లతో గర్భిణీ లకు స్కానింగ్ రక్త పరీక్షలు, తనిఖీ లు నిర్వహించి మధ్యాహ్నం భోజనం కూడా ఏర్పాటు చేయడం జరుగిందని తెలిపారు. ప్రతీ గర్భిణీ వైద్య పరీక్షలు తో పాటు పౌష్ట కాహారం, పండ్లు,పాలు బుజించాలని, తగినంత విశ్రాంతి తీసుకోవాలని డెలివరీ సమయంలో ఆశ కార్యకర్తలు ద్వారా పి హెచ్ సి ల్లో సుఖ ప్రసవం పొందాలని కోరారు. ఈకార్యక్రమంలో జేమ్స్ వైద్యు లు వర్షిణి, ఈఓ కెథర్మారావు, హెచ్వి ఆదిలక్ష్మి, ఆశ కార్యకర్తలు, ఎఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సాయిగణేష్ దుర్గా వైష్ణవిలను ఆశీర్వదించిన చంద్రబాబునాయుడు

విశాలాంధ్ర - హిరమండలం/పాతపట్నం : పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు తనయుడు డాక్టర్ మామిడి సాయి గణేష్ డాక్టర్ దుర్గ వైష్ణవి ల వివాహ నిశ్చితార్థం సందర్భంగా కాబోయే వధూవరులను సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశీర్వాదించారు. సీఎం చంద్రబాబు మాట్లాడుతూ కాబోయే నవ దంపతులు నిండు నూరేళ్లు పిల్ల పాపలతో సుఖంగా జీవించాలని నిండు మనుస్సు తో దీవించానని పాతపట్నం నియోజకవర్గ ప్రజలకు చక్క నైన వైద్య సేవ లు అందజేయాలని తెలియజేశారు. ఎమ్మెల్యే మామిడి గోవిందా రావు తో పాటు నాయకులు టీడీపీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

సాగునీటి సమస్య లేకుండా చూస్తాం : ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : నియోజకవర్గంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా సాగునీరు అందించడమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రూరల్ పరిధిలోని సప్తపురాల్లో ఉన్నటువంటి టీ మన్నయ్యపేటలో సోమవారం చెరువుకు ఎమ్మెల్యే శంకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చెరువులను పట్టించుకోకపోవడంతో రైతులు పూర్తిగా దినవస్థలోకి చేరిపోయారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సాగునీటి కాలువల్లో పూడికలు తీయించి, చెరువులను బాగు చేయించి రైతులకు అండగా నిలిచారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతు బాంధవుడు అని రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మే సిద్ధాంతం చంద్రబాబుది అని పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వం లో రైతన్నలను వెన్ను విరిచి వారిని పూర్తిగా ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టింది అని చెప్పారు. రైతుని రాజు చేయాలన్న లక్ష్యంతోనే వారికి మద్దతు ధరను పెంచి కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. జిల్లాలో కిషన్ మేళా నిర్వహించి రైతులకు ఆధునిక యంత్రాల వినియోగంపై శిక్షణ అందించడం జరిగిందని చెప్పారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు ఆధ్వర్యంలో విత్తనం నాటిన నుంచి ధాన్యం విక్రయించే వరకు రైతులకు అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఐటీఐ అప్రంటీస్ మేళాలో 38 మంది ఎంపిక

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : ఎచ్చెర్లలోని ప్రభుత్వ ఐటీఐలో సోమవారం నిర్వహించిన ప్రధాన మంత్రి జాతీయ అప్రంటీస్ మేళాలో 38 మంది ఎం పికయ్యారు. మొత్తం 112 మంది అభ్యర్థులు హాజరుకాగా, ఇందులో 38 మందిని వివిధ కంపెనీల్లో అప్రంటీస్కు ఎంపికచేశారు. ఈ సందర్భంగా జిల్లా అడ్మిషన్ల కన్వీనర్, ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్. సుధాకరరావు మాట్లాడుతూ ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అ ప్రంటీస్ పూర్తిచేస్తే ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. ఎప్పటికప్పుడు జరిగే ఈ మేళాను సద్వినియోగం చేస కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంసీ చైర్మన్ ఎంవీఆర్ మూర్తి, జూనియర్ ఎంప్లాయిమెంటు అధికారి శ్రీనివాసరావు, వివిధ కంపెనీల హెచ్ఆర్లు రామారావు, శ్రీనివాసరావు, వంశీ, ఐటీఐ ట్రైనింగ్ ఆఫీసర్లు వి.రఘురాం, బీఏవీసీ కామేశ్వరరావు, పి. విద్యాసాగర్ పాల్గొన్నారు.

14కిలోల గంజాయితో వ్యక్తి అరెస్ట్

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : గంజాయి బ్యాగుతో అనుమానస్పందంగా ఉన్న వ్యక్తిని తనిఖీ చేసి అతని వద్ద నుండి 14.450కిలోల గంజాయిని పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసారు. పోలీస్ ఇన్స్పెక్టర్ మీసాల చిన్నంనాయుడు వెల్లడించిన వివరాల మేరకు ఒడిశా గజపతి జిల్లా మోహన బ్లాక్ బీజపూర్ గ్రామానికి చెందిన విద్యాసాగర్ ఎర్నాకుళంలో కూలి పని చేసుకుంటుండగా అక్కడ గంజాయి వ్యాపారం చేసే షాహిల్ ఖాన్తో పరిచయం ఏర్పడింది. షాహిల్కు తోడ్పడుతు సింకులి పదర్లో ఉన్న తన అత్తవారింటికి వచ్చి అక్కడ గంజాయి విక్రయించే కుమార్ దగ్గర గంజాయి కొనుగోలు చేసి షాహిల్ ఖాన్కు అందిస్తుంటాడు. ఆ క్రమంలో ఈ దఫా తాను కొనుగోలు చేసిన గంజాయితో సోమవారం బస్సులో వచ్చి లొద్దపుట్టి జాతీయ రహదారి తులసమ్మ గుడి సమీపంలోని ఫ్లై ఓవరు బ్రిడ్జ్ క్రింద దిగాడు. గస్తీ తిరుగుతున్న రూరల్ ఎస్సై శ్రీనివాసరావుకు సింగ్ కదలికలు అనుమానం కల్గించి తనిఖీలు చేపట్టారు. దాంతో విద్యాసాగర్ వద్ద మూటల్లో 14కేజీల 450 గ్రాముల గంజాయి పట్టుబడింది.

సైబర్ నేరాలపై అవగాహన

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : ప్రభుత్వం నేరాల నియంత్రణకు అన్ని రకాల చర్యలు తీసుకుటుందని, ప్రజలు మోస పోకుండా నేరాల్లో చిక్కుకోకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని పోలీస్ ఇన్స్పెక్టర్ ఎం. చిన్నంనాయుడు అన్నారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా సోమవారం పూరేటి వీధిలో ప్రజలకు నేరాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు బానిసలుగా మారవద్దని, పిల్లలను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని, వారు చెడు అలవాట్లకు, తప్పుడు మార్గాల్లో డబ్బు సంపాదనకు అలవాటు పడితే పోలీస్ వారి సహాయం తీసుకుని సమస్యలు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. సారా, గంజాయి వంటి మాదక ద్రవ్యాలు కల్గివుండటం, తరలించడం తీవ్రమైన నేరాలని తెలిపారు. సాంకేతిక వినియోగంతో పాటు సైబర్ నేరాల సంఖ్య పెరుగుతుందని, మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ వినియోగంలో పిల్లలు పెద్దలు జాగ్రత్తగా ఉండాలని, అపరిచితులకు ఓ.టి.పిలు వెల్లడించవద్దని వివరించారు.

జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలి : ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : క్రీడాకారులు ఆటల్లో రాణించి జిల్లా కీర్తిని ఇనుమడింపజేయాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. క్రీడా పోటీల్లో బహుమతులు సాధించిన క్రీడాకారులకు సోమవారం ఆయన విశాఖ ఏ కాలనీలోని తన కార్యాలయంలో అభినందించారు. సౌత్ వెస్ట్ ఇంటర్ యూనివర్సిటీలో బంగారు పతకం సాధించిన బోరవెల్లి గ్రామానికి చెందిన దోబ యామశ్రీని, స్కూల్ గేమ్స్ అండర్ 19 సిల్వర్ మెడల్ తాళాడు కావ్యను, స్కూల్ గేమ్స్ అండర్ 19 బ్రాంచ్ మెడల్ సాధించిన పట్నాన్ చంద్రశేఖర్ ను ఎమ్మెల్యే అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని ఇటీవల స్పోర్ట్స్ కోటాలో క్రీడాకారులకు ప్రాధాన్యత కల్పిస్తూ నిర్ణయించిందని వివరించారు. క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని చిన్నారులు క్రీడల పోటీల్లో పాల్గొని శారీరకదా ఆరోగ్యాన్ని పెంచుకోవాలని చెప్పారు. తల్లిదండ్రులు చిన్నారులను క్రీడలు పట్ల ఆసక్తి కలిగేలా ప్రోత్సహించాలని చెప్పారు. నియోజకవర్గంలో క్రీడ మైదానాల సంఖ్యను పెంచుతున్నామని గ్రామీణ స్థాయి నుంచి నాణ్యమైన క్రీడాకారులు బయటికి రావాలని ఆయన ఆకాంక్షించారు. వీరితో పాటు కోచ్ ఇప్పిలి అప్పన్న, గుజ్జలా హిమగిరిపాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం

విశాలాంధ్ర - టెక్కలి : మేజర్ పంచాయతీలో అంబేద్కర్ కూడలి నుండి ఇంద్రగాంధీ కూడలి వరకు బీటీ రోడ్డు పనులను 24 లక్షలతో సోమవారం పట్టణ అధ్యక్షులు కోళ్ల లవకుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు ఈ పనులను ప్రారంభించి త్వరలోనే పూర్తి చేస్తామని అన్నారు. కూటమి ప్రభుత్వంలో రహదారి పనులు సర్వేయెగంగా కొనసాగుతున్నాయని, అది ఒక్క కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్పి డిఈ, హనుమంతు రామకృష్ణ, మామిడి రాము, దల్లి ప్రసాద్ రెడ్డి, ఇప్పిలి జగదీష్, ధోని బుజ్జి, మల్లపెద్ద మధు, బెహరా కాళీ, దుర్గారావు, కోరాడ రాంప్రసాద్, అభిలాష్, మురళి, శివ కిరణ్, శ్రీను, గణేష్, శంకర్ టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ప్రయోజనకరంగా ధాన్యం కొనుగోలు

ఎమ్మెల్యే కూన రవికుమార్

విశాలాంధ్ర - పొందూరు : రాష్ట్రంలో రైతులకు సానుకూలంగా, ప్రయోజనకరంగా ఉండేలా కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలం గోరింట గ్రామంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలులో వైసీపీ నాయకుల చేతివాటం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రైతులు తమకు అనుకూలమైన రైస్మిల్లుకు బదులు ప్రభుత్వం ఎక్కడో సూచించిన రైస్ మిల్లుకు ధాన్యం విక్రయం చేయాల్సి రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, దూరంగా ఉన్న మిల్లుకు దాన్యం తరలించడం వలన రైతులపై రవాణాచార్జీలు బారం పడేదని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబనాయుడు ఆధ్యర్యంలోని కూటమి ప్రభుత్వం రైతులకు అనుకూలమైన, సమీపంలో రైస్ మిల్లుకు విక్రయించుకునే వెసులబాటు కల్పించదన్నారు. తేమఉన్న ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ధాన్యం విక్రయించిన రెండుమూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్ రామాను జులు, వ్యవసాయశాఖ ఏడీ శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ సీహెచ్ శ్రీలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షులు సీహెచ్ రామ్మోహన్, నాయకులు కూన సత్యనారాయణ, సీహెచ్ వాసుదేవ రావు, అన్నెపు రాము, సీపాన శ్రీరంగనాయకులు, బలగ శంకరబాస్కర్, కె. నాగేశ్వరరావు, పి. వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో భూఆక్రమాలు వెలికితీసేందుకే రెవెన్యూ సదస్సులు

విశాలాంధ్ర - పొందూరు : రీసర్వే పేరుతో గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో నాయకులు భూఆక్రమణలకు, అక్రమాలకు, కబ్జాలకు పాల్పడ్డారని వీటిని వెలికితీసేందుకే కూటమి ప్రభుత్వం ప్రతీ గ్రామంలోను రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని ఎంఎల్ఏ కూన రవికుమార్ తెలిపారు. మండలం గోరింట గ్రామంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వభూములు, అసైన్మెం భూములను కొట్టేయడానికే రాష్ట్రంలో రీసర్వే నిర్వహించారని విమర్శించారు. రీసర్వే పేరుతో అమాయకుల భూములను ఆక్రమించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. రెవె న్యూ సదస్సులలో ఇటువంటి తప్పిదాలను సవరించి బాధితులకు న్యాయం చేస్తామన్నా రు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్, సర్పంచ్ శ్రీలక్ష్మి టీడీపీ నాయకులు సీహెచ్ రామ్మోహన్, కూన సత్యనారాయణ, ఎ. రాము, ఎస్. శ్రీరంగనాయకులు, బి. శంకరబాస్క 5. సీహెచ్ వాసుదేవరావు, వరదరాజులు, రెవెన్యూ దేవాదాయ, సర్వే అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు చెన్నుపాటి లక్ష్మయ్య సేవలు మరువలేనివి

విశాలాంధ్ర - టెక్కలి : ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు చెన్నుపాటి లక్ష్మయ్య సేవలు మరవలేనివని ప్రధానో పాధ్యాయు రాలు ఎం అనూరాధా అన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చాకిపల్లిలో ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి మహాసభను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆయన సంఘము పెట్టుకోవడానికి అవకాశం లేని రోజులలో కూడా సంఘాన్ని నిర్మించి కోర్టుల నుండి ఆదరణ తెప్పించుకున్నటువంటి మహానేత చెన్నుపాటి లక్ష్మయ్య అని కొనియాడారు. జిల్లా సహాధ్యక్షులు కె.దాలయ్య మాట్లాడుతూ ఆయన అడుగుజాడలలో ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు ఉద్యమించి సమస్య సాధనకు తోడ్పడాలని ప్రతి ఉపాధ్యాయుడు ఉద్యమ స్ఫూర్తితో ముందుకు జరగాలని కోరారు. ఉపాధ్యాయులు పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ లక్ష్మయ్య 1910 జనవరి 10వ తేదీన గుంటూరు జిల్లా వేమూరు గ్రామములో జన్మించారని 15 రూపాయల నెల జీతానికి పనిచేసే ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ సంఘాన్ని నిర్మించి ఉద్యమానికి బాటలు వేశారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టీ. వైకుంఠ రావు, కె.నారాయణరావు, పి ఋషి,బి.ఆనందరావు,కె. మురళీకృష్ణ, ఆర్.జ్యోతి, కె.సుధారాణి, సిహెచ్ భారతి, ఎం.మోహిని, బాడాన నారాయణరావు, రమేషు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి : ఎస్ఐ అశోక్ బాబు

విశాలాంధ్ర - జలుమూరు : మండల కేంద్రంలో జలుమూరు పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ అశోక్ బాబు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బాలికల ఉనత పాఠశాల విద్యార్థినులచే ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ మత్తు పదార్థాల వలన యువత పాడవుతుందని దీనివలన మనం కాకుండా మన తల్లిదండ్రులు మన కుటుంబాలు పూర్తిస్థాయిలో నాశనం అవుతున్నాయని ఆయన వివరించారు. ప్రతి ఒక్క కుటుంబంలో తల్లిదండ్రులు శ్రమించి చదివిస్తున్నందుకు విద్యార్థులంతా మానవతా దృక్పథంతో మత్తును దూరంగా ఉంచి మానవ మనుగడి కోసం పాకులాడాలని కోరారు. ఆయనతోపాటు ఉపాధ్యాయ సిబ్బంది, పోలీస్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

రెవిన్యూ సదస్సు వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు సదస్సు కార్యక్రమాన్ని రైతులు వినియోగించుకోవాలని మండల తెలుగుదేశం అధ్యక్షులు మోహనరావు అన్నారు. సోమవారం మండలం అక్కుపల్లి, బైపల్లి గ్రామాలలో నిర్వహించిన రైతు సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ భూములకు సంబంధించి సర్వే నెంబర్లు గాని వన్ బిల్లు గాని రాకపోతే రెవిన్యూ సదస్సు లో పూర్తిగా తమ భూముల వివరాలు దరఖాస్తు రూపంలో అందజేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ తహసిల్దార్ మురళి,వీఆర్వో ఇందిరా వెంకట్రావు సర్పంచ్ ఇంచార్జి ఎల్ రామలింగం వీఆర్ఏ కవిత, మండల సర్వేయర్ కొండపు తిరుపతి తో పాటు రైతులు పాల్గొన్నారు.